# శ్రీ రమణ జ్యోతి

సంపుటి-44 సంచిక - 7 హైదరాబాదు జూలై, 2024 పేజీలు - 52 రూ. 10/- సంవత్సర చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 44 Issue - 7 Hyderabad July, 2024 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



**BHAGAVAN SRI RAMANA MAHARSHI**



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

| శ్రీ రమణ జ్యోతి | **Sri Ramana Jyothi** |
|---|---|
| జులై 2024 | July 2024 |
| ఈ సంచికలో ... | IN THIS ISSUE ... |


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 120వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీ భగవాన్‌తో గ్రిద్దలూరి కుటుంబం అనుబంధం** | శ్రీ గ్రిద్దలూరి కృష్ణమూర్తి | 11 |
| **3.** | **తిరుచ్చుళి - శ్రీ రమణుల జన్మస్థానం** | శ్రీ ఎమ్.వి. సరోజాప్రసాద్ | 24 |
| **4.** | **అభ్యాసం - ఆవశ్యకత** | చిక్కాల కృష్ణారావు | 28 |
| 5. | A Series of Extraordinary Events | Dr K Subrahmanian | 30 |
| 6. | Ashtavakra Gita 26 | V Krithivasan | 41 |
| 7. | Ratnammal | Sneha Choudhury | 45 |
| 8. | Retrospect | SS Cohen | 49 |


## Events in Sri Ramana Kendram in July 2024

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 6th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
4. Guru Purnima - 21st July

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు, e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)

© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.

**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# భగవంతుడే అన్నీ ఇస్తాడు

డా॥ కే.యస్. గారి 120వ ప్రవచనం

అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

మనం నిద్ర లేచినప్పటినుండి రాత్రి పడుకునే వరకు మనస్సుకు ప్రశాంతత ఉండదు. ఏకాంతంగా ఉన్నప్పుడు, ఏదో పుస్తకాన్ని తీసుకుని చదువుతాం. అది ఎలాంటి పుస్తకం అయినా సరే, ఆధ్యాత్మిక సంబంధమైనదో, నవలో, ఏదో పద్యమో కావచ్చు లేదా ఎవరితోనో మాట్లాడటమో, సంగీతాన్ని వినడమో, టి.వి. చూడడమో, లేదా సినిమా చూడడానికో వెళతాం. కొందరికి మద్యం త్రాగే అలవాటు ఉంటే, ఆ పని చేస్తారు. దీనిని బట్టి మనం అర్థం చేసుకోవలసినది ఏమిటంటే, మనమందరమూ కోరుకునేది మానసిక ప్రశాంతతను.

అలాగ రోజూ మనల్ని మనం మరచిపోవడం కోసం ఇవన్నీ చేస్తాం. పుస్తక పఠనంలో మునిగినప్పుడు లేదా ఇతరులతో మాట్లాడినప్పుడు తృప్తిగా ఉంటుంది. ఏదో అలాంటి ఒక చర్య వల్ల, మనస్సు ఆ విషయం వైపు ఆకర్షింపబడుతుంది. త్రాగుడు అలవాటు ఆరోగ్యానికి మంచిది కాదు. కాని, అప్పుడూ మనల్ని మనం మరచిపోవడం జరుగుతుంది.

ప్రధానంగా ఈ చర్యల ఉద్దేశ్యం, నిన్ను నీవు ఎదుర్కొనే అవసరం లేకుండా చేసుకోవడానికే. నీ నుండి నీవు తప్పించుకునేందుకే. కాని, అలాంటి చర్యల వల్ల లభించే తృప్తి, కొంతసేపు మాత్రమే ఉంటుంది. కాసేపు పుస్తకం చదవడం ఆపితే, ఏమి

చేయడానికి తోచక, మరేదో పని చేయాలనిపిస్తుంది. ఎందుకంటే, మనస్సుకు ఎల్లప్పుడూ ఏదో ఒకటి చేయాలని ఉంటుంది. మనసును నెమ్మది పరచడానికి ధ్యానం, జపం, పూజ, నామ సంకీర్తనం వంటి వాటిని చేయాలని ఆధ్యాత్మిక గ్రంథాలు సలహాలు ఇస్తూ ఉంటాయి. కాని, వాటి ప్రభావం కూడా కొంతసేపే ఉంటుంది. ఆ సమయంలో మనస్సు కొంతసేపు హృదయంలో లయమవుతుంది. అదే 'లయ వినాశనే ఉభయ రోదనే'.

### చక్కని సలహా

భగవాన్ శ్రీ రమణ మహర్షి, ఈ సమస్యకు చక్కని పరిష్కార మార్గం చూపించారు. భగవంతునికి సంపూర్ణంగా శరణాగతి చెందడం, లేదా 'నేను' ఎవరో అన్వేషించి తెలుసుకొనడం అవసరమని బోధించారు. ఒకవేళ, నా గురించి నేను అవగాహన చేసుకునేందుకు ఏవో పుస్తకాలు చదివి, ఒక పద్ధతి బాగుందనుకుంటే, ఇతరులు అంతకంటే మరేదో ఇంకా మంచిదంటారు. వాళ్ళతో వాదించాల్సి వస్తుంది. అలాంటి వాదనలు, దేవుళ్లలో శివుడు గొప్పవాడా? విష్ణువు గొప్పవాడా? అనే వరకు పోతాయి. శైవులు, వైష్ణవులు తమ తమ ఇష్ట దేవతలు ఎందుకు గొప్పవారో అనేది ఋజువు చేసే ప్రయత్నాలు చేస్తారు. అవి మనల్ని ఎక్కడికీ చేర్చవు.

కేవల పాండిత్యం, మనకు ఈ విషయంలో ఉపయోగపడదు. అందుకే, లలితా సహస్ర నామావళిలో 'ఆబాల గోపవిదితా సర్వానుల్లంఘ్యశాసనా' అనే నామం చదువుతాం. అంటే ఏదో గొప్ప చదువులు చదువుకుని, అన్నీ తెలిసినవారు మాత్రమే అమ్మను అవగాహన చేసుకోగలరన్నది నిజం కాదని ఈ నామంలో తెలుపబడి

ఉన్నది. ఏ చదువూ లేని అమాయకులైన పశు కాపరులకు (గోప బాలురు, గోపికలు) కూడా, అమ్మ అవగతమవవచ్చు. కావలసినది మంచి హృదయమే గాని, బుద్ధి కుశలత కాదు. శ్రీ రామకృష్ణ పరమహంసకు తన సంతకం పెట్టడం తెలియదు. జీసెస్ క్రీస్తు, శ్రీ రమణ మహర్షి ఏ కాలేజీలకూ వెళ్ళలేదు. ఎందరో గొప్ప ఆచార్యుల విషయంలో ఇది వర్తిస్తుంది. చిన్నప్పుడే, సకల శాస్త్రాలపై పట్టు సాధించిన ఆది శంకరాచార్యులు, తమ ''వివేక చూడామణి''లో 'శబ్దజాలం మహారణ్యం చిత్త భ్రమణ కారకం' అని అన్నారు. శాస్త్రాలనే మహారణ్యంలో చిక్కుకొని, వాదనలతో సమయం వృథా చేసుకునే వారికి, శాస్త్ర పాండిత్యం చిత్త భ్రమణ మునకు కారణమవుతుంది అని అన్నారు.

## వాదనలు నిరర్థకం

వాదనలోకి దిగితే, మనం గెలవవచ్చు, గెలవలేకపోవచ్చు. మేధోపరమైన విజ్ఞానం కొంత తృప్తి నివ్వవచ్చునేమో కాని, భగవంతుని కృప లభించనప్పుడు, మరింత దుఃఖం కలుగుతుంది. ఎందుకంటే, మనకు విజయం లభించకపోతే, మన గర్వం దెబ్బ తింటుంది. గెలిచామంటే, మరొకచోట మళ్ళీ మన పాండిత్యాన్ని ప్రదర్శించాలని అనుకుంటాము. ఈ క్రమంలో, మనకు కావాలనుకున్న మానసిక శాంతి లభించదు.

ఇతరులను మెప్పించే ఈ ప్రయత్నాలు మంచివి కావని భగవాన్ అన్నారు. కొందరు మీ గురించి మంచి విషయాలను చెప్పవచ్చు. ఇంకొందరు దానికి విరుద్ధ భావాలను వ్యక్తం

చేయవచ్చు. ఆ మెచ్చుకునే కొందరు కూడా, బయటికి ఒకటి చెబుతూ, లోపల మరేదో అనుకుంటూ ఉండవచ్చు. ఇతరుల అభిప్రాయాలను బట్టి, మన ప్రవర్తనను మార్చుకోలేము. మేధావి సోక్రటీస్ ఇలా అనేవారు - 'తాను దేనినీ పట్టించుకోనని', ఈ ప్రపంచంలో తన గురించి ఎవరి అభిప్రాయాన్ని తాను ఆశించనని అనేవారు. ఎందుకంటే, వాళ్ళు నా గురించి మాట్లాడితే వాటిని అంగీకరించడానికి నేను చాలా ఇబ్బంది పడతాను. దానికి కారణం, అందులో చాలామంది ఆత్మ గౌరవం లోపించిన వారే ఉంటారు. ఇంకొక విధంగా చెప్పాలంటే, ఆత్మ గౌరవం లేని వారి మాటలకు విలువ ఉండదు. అటువంటి వాళ్ళ అభిప్రాయాలను వినడం తప్ప, అంతరంగంలో వాటి ప్రభావం పడకుండా చూసుకోవాలి. లేకపోతే మన ప్రశాంతత దెబ్బ తింటుంది. కాని, ఈ విషయం గ్రహించడానికి కూడా దైవ కృప ఉండాలి.

## తటస్థంగా ఉండలేము

ప్రతి ఒక్కరూ, తాము ప్రఖ్యాతి పొందాలని, తమని గురించి అందరూ మంచిగా మాట్లాడాలని కోరుకుంటూ ఉంటారు. మనంతట మనము పొగడ్తలకు, విమర్శలకు తటస్థంగా ఉండలేము. కానీ రెండింటినీ సమానంగా భావిస్తే, మనకు కావాల్సిన శాంతి లభిస్తుంది. ఎప్పుడైతే ఇతరులు మన పట్ల మంచి అభిప్రాయాన్ని కలిగి ఉండాలని కోరుకుంటామో, అప్పుడు మనకు శాంతి లభించదు. మన గురించి చెడుగా అనుకుంటే బాధపడతాం.

**దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగతస్పృహః**
**వీతరాగభయక్రోధః స్థితధీర్మునిరుచ్యతే**

రాగ ద్వేషాలకు అతీతంగా, సుఖ దుఃఖాల పట్ల విముఖంగా ఉండడమే కాదు, మనల్ని విమర్శించే వారిని శత్రువులుగా భావించ కూడదు. ఈ ప్రపంచంలో 'మాట' అన్నింటికంటే శక్తివంతమైనది. పొగడ్తలకు మంచిగా ప్రతిస్పందించి, విమర్శలకు కోపం తెచ్చు కుంటాం. భగవాన్ అది పనికిరాదన్నారు.

చక్కగా జీవించడం గురించి మనం మాట్లాడుతూ ఉంటాము. ఆ విషయంపై ఎన్నో పుస్తకాలు రచింపబడ్డాయి. కాని, మనం దీర్ఘంగా ఆలోచిస్తే, ఎలా మరణించాలో తెలిసిన వాళ్ళే, సరిగ్గా జీవించగలరు అని గ్రహిస్తాము. ఈ 'మరణం' అంటే ఏమిటి? అది అహంకారరహిత స్థితి. ఎప్పుడైతే వ్యక్తి తన అహాన్ని తగ్గించు కొంటాడో, లేదా అహాన్ని అసలే లేకుండా చేసుకుంటాడో, లేదా తనలోని కరుణా స్వభావాన్ని పెంచుకుంటాడో, అప్పుడు ఆనంద మయ జీవితం గడుపుతాడు. అది ఒత్తిడి లేని జీవితం.

అహాన్ని చంపుకోవడం ముఖ్యం. ప్రతిరోజూ గాఢ నిద్రలో అదే జరుగుతుంది. మనస్సు, శరీరం స్పృహలో లేనప్పటికీ, మనం చాలా ఆనందంగా ఉంటాము. ఆ ఆనందాన్ని ఎవరు అనుభవిస్తున్నారు? అందుకే, ప్రొద్దున మేల్కొన్నప్పుడు, రాత్రి బాగా నిద్ర పట్టిందని అంటాము. మనస్సుకు అతీతమైన ఆ స్థితిని మాటల్లో వర్ణించలేము.

**అహంకారం పనికిరాదు**

**విహాయ కామన్ యః సర్వాన్ పుమాంశ్చరతి నిస్పృహః**

**నిర్మమో నిరహంకారః స శాంతిమధిగచ్ఛతి**

అహంకారం, మమకారం లేని వ్యక్తి 'అహం' లేని స్థితిని హాయిగా అనుభవిస్తాడు. దానిని సత్సంగం ద్వారా సులభంగా అనుభవించవచ్చునని భగవాన్ అంటారు. అసలు సత్సంగంలో జరిగేది ఏమిటి? మనస్సు ప్రశాంతమవుతుంది. అది కాస్సేపే కావచ్చు, లేదా చాలాసేపటి వరకూ కూడా కొనసాగవచ్చు. అది కూడా భగవంతుని ఇచ్ఛ మేరకు జరుగుతుంది. అది మన అదుపు లోని విషయం కాదు. భగవంతుని కరుణ చేత ఇవ్వబడుతుంది.

పూజ, జపం, ధ్యానం వంటివి చేస్తూ, ఫలితాన్ని భగవంతునికి వదిలి వేయాలి. శాంతి మనం నిర్దేశించినప్పుడు రాదు, భగవంతుడు అనుగ్రహించిన సమయంలో ప్రసాదింపబడుతుంది. గురువులు, జ్ఞానుల వద్దకు ప్రశాంతత కోసం మనం వెళతాము. కాని, కేవలం ఏదో మాట్లాడడం కోసం వెళ్ళిన వారు ఎటువంటి వారంటే, మాటల మాధ్యమం అవసరం లేకుండానే మన భావాలను వ్యక్తీకరించవచ్చు అనే అవగాహన లేనివారు. గురువు సన్నిధిలో మౌనంగా కూర్చున్న వారికి, గురువు తాను అనుభవిస్తున్న శాంతిని వారికీ అందించ గలడు.

జ్ఞానులు దేహానికి పరిమితం కానివారు. ఇక్కడ, అక్కడ, మరెక్కడైనా ఉండగలరు. 'ఆలంబేన విహీనం వ్యోమాభం పరిపూర్ణం' - మనం శరీరానికి పరిమితం అయినవాళ్ళం కనుక, జ్ఞానుల సమక్షంలో ఉన్నప్పుడే మనం వారి అనుగ్రహానికి పాత్రుల మవుతాము అని భావిస్తాము. సాధనలో పురోగతి చెందిన కొద్దీ, అక్కడకు వెళ్ళ వలసిన అవసరం కూడా లేదని తెలియవస్తుంది.

నిశ్శబ్దం గురు రూపం - మౌనమే గురు రూపం దాల్చి ఉన్నది. మౌన రూపంలో ఉన్న గురువు దక్షిణామూర్తి యొక్క ప్రత్యేకత ఇదే. పలు కారణాల వల్ల, చాలా మందికి మౌనంగా ఉండడ మన్నది అంతగా నచ్చదు. దక్షిణామూర్తి స్వయంగా శివుడే. ఆ పరమ శివుడు, సత్యం యొక్క ప్రాముఖ్యతను ఎప్పుడైతే మౌనం ద్వారా తెలియజేశాడో, ఆ సమయంలో అక్కడ ఉన్నది నలుగురు ఋషులు మాత్రమే. పెద్ద జన సమూహం అక్కడ లేదు. వాళ్ళు గురువు యొక్క బోధను చక్కగా అర్థం చేసుకొని, ఆకళింపు చేసుకొని, మౌనాన్ని ఆనందంగా ఆస్వాదించారు.

**జ్ఞాన వాంఛ**

ఒక సందర్భంలో కంచి పరమాచార్యులవారు, "ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన విధంగా నడుచుకోవచ్చు కాని, కొన్ని విషయాలను కొంతమంది మాత్రమే అనుసరించగలరు" అని అన్నారు. ఎక్కువ మంది కర్మ, భక్తి మార్గాలనే అనుసరించటానికి కారణం ఏమిటంటే, వాటివల్ల కలిగే ఫలితాలను తాము అచిరకాలంలోనే చూడగలుగు తారు కనుక. జ్ఞానం గురించి చెబుతూ, జ్ఞానాన్ని వాంఛించే వారు బహు తక్కువ మంది ఉంటారు. ఉదాహరణకు, మనం కూరగాయల మార్కెట్‌కు వెళితే, అక్కడ చాలా మంది ఉంటారు. అదే వజ్రాల దుకాణానికి వెళ్ళినప్పుడు, అంతమంది ఉండరు. కూరగాయలు కొనటం కంటే, వజ్రం కొనాలంటే అధిక ధనం ఉండాలి. ఆ అధిక ధనం ఎలా వస్తుందంటే, వీళ్ళు (వజ్రాలను కొనుగోలు చేసేవారు) గత జన్మలలో గొప్ప పుణ్యం చేసుకొని ఉండాలి. జ్ఞాన విచారణ చేస్తూ, ఆ మార్గంలో నడుస్తున్నామంటే,

అది పూర్వజన్మలలో మనం చేసుకొన్న పుణ్యకర్మల వల్ల తప్ప, మన గొప్పతనం వల్ల కాదు.

భగవంతుని తలుచుకోవడానికి కూడా ఆయన కృప కావాలి. మనకున్న గొప్ప బుద్ధి చేతనో, ప్రయత్నాల చేతనో ఆయనను మనము తలుచుకోలేము. ఈ విషయాన్ని గుర్తించిన క్షణంలో, ఏదీ కావాలని కోరుకోము. ఎందుకంటే, ఆయనను గురించి తలుచుకునే విధంగా చేసిన ఆయనకు మనము ఏమి ఇవ్వగలము? అందుకే, భగవాన్ "దేనినీ అడగకండి, మనకేది మంచిదో అది ఆయనకు తెలుసు" అని అనేవారు. ఆయనను తలుచుకునేలా ఆయనే చేయటం అనేది ఒక ఆశ్చర్యకరమైన పరిస్థితి. దానిని గుర్తించినప్పుడు, బదులుగా మనం ఆయనను ఏమీ అడగవలసిన అవసరం లేదు. కావాల్సినది ఆయనే మనకిస్తాడు.

ఏదైనా కోరినప్పుడు మనం ఒక అవిశ్రాంత స్థితిలో ఉంటాము. అది ఫలించకపోతే నిరాశ చెందుతాము. లభించినప్పుడు ఎంతో సంతోషిస్తాము. మళ్ళీ ఇంకేదో కావాలని అడుగుతాము. ప్రతీదీ భగవంతుని ఇచ్ఛ ప్రకారమే జరుగుతుంది అని గ్రహిస్తే, అది మనం ఉన్నత స్థాయికి చేరినట్లు సంకేతం. నా భక్తికి బదులుగా నేనేమీ ఇమ్మని కోరను. నేను వ్యాపారస్థుడిని కాను. అది వ్యాపార వ్యవహారం కాదు. తరచు మన కోరికలలో, మన అవసరాలకు మించి మన దురాశలే ఎక్కువగా కనిపిస్తాయి. మానసిక ప్రశాంతత భగవంతుని కృప వల్లనే ఏర్పడుతుంది.

******

# శ్రీ భగవాన్‌తో గ్రిద్దలూరి కుటుంబం అనుబంధం

(మే సంచిక తరువాయి) శ్రీ గ్రిద్దలూరి కృష్ణమూర్తి

ఒకసారి భగవాన్ దగ్గరికి ఒక భక్తుడు వచ్చి, భగవాన్ మీ గురించి ఒకరు చాలా చెడుగా మాట్లాడుతున్నారు ఏం చేయాలి? అని అడిగితే, భగవాన్ మౌనంగా ఉండు అని అన్నారు. మళ్ళా అడిగితే, ఓర్పుతో వుండు అన్నారు. ఇంకా అడుగుతూ వుంటే ఇంకా ఓర్పుతో వుండండి అని చెప్పారు కానీ భగవాన్ దాని నుండి ప్రక్కకు జరగలేదు. భగవాన్ ఎవ్వరి గురించి చెడుగా మాట్లాడలేదు. చెడుగా మాట్లాడితే అది తిరిగి మనకే వస్తుంది. అక్కడ వున్నది, ఇక్కడ వున్నది ఆత్మే. ప్రతీ ఒక్కరూ సాధన చేస్తున్నాము అని అంటే అనవచ్చు కాని, వారు మాట్లాడే విధానాన్ని బట్టి, వారు వ్యవహరించే తీరుని బట్టి వారి సాధనలో వారు ఎక్కడ వున్నారో తెలుస్తుంది.

## వెన్నెలకంటి ప్రహ్లాద్

మా అక్క (చిన్నాయన గ్రిద్దలూరి సుబ్బారావు గారి కుమార్తె) భర్త వెన్నెలకంటి ప్రహ్లాద్ గారు మెడికల్ డిపార్టుమెంటులో లీగల్ సెల్ లో అసిస్టెంట్ డైరెక్టరు. అతను గొప్ప ప్రేమ స్వరూపుడు. తను ఆంధ్రా విశ్వవిద్యాలయంలో హౌస్ సర్జన్ చేస్తున్న రోజులలో టి.బి. వచ్చింది. హాస్పిటల్‌లో చేర్చారు. అప్పుడు ప్రతీరోజు భగవాన్‌కు ఉత్తరాల ద్వారా అతని పరిస్థితిని తెలియచేసేవారు. కొన్ని సమయాలలో మా వాళ్ళు భగవాన్ దగ్గరకు పోలేక మా అత్త లక్ష్మమ్మ గారిని పంపించేవారు. భగవాన్ ఆమెను నంబ లక్ష్మి (మన లక్ష్మి) అని ప్రేమతో పిలిచేవారు. ఒక రోజు మా బావగారిని ఎమర్జన్సీ

వార్డులో పెట్టారు. లోపల ఏమి జరుగుతున్నదో తెలియదు. బయట మెట్ల మీద ఒక సాధువు, అతని పరిచారకుడు ఇద్దరూ పైకి వస్తూ వున్నారు. సాధువు చేతిలో కమండలం వున్నది. వాళ్ళిద్దరూ వచ్చి నేరుగా ఎమర్జన్సీ వార్డులోకి వెళ్ళారు. అక్కడకు వెళ్ళి 'ప్రహ్లాద్ ఇంక రేపటి నుండి నీకేమి వుండదు' అని చెప్పి శరీరం పై నుండి క్రింద వరకూ తడిమి వెనక్కు తిరిగి వెళ్ళిపోయారు. అక్కడ వారిద్దరినీ హౌస్ సర్జన్స్‌తో సహా అందరూ చూశారు. అప్పుడు అక్కడ వున్న కొంతమంది స్టూడెంట్స్ వచ్చి సర్, సర్ మీ రూములోకి ఎవరో ఇద్దరు సాధువులు వచ్చారు అని అంటే ప్రహ్లాద్ గారు 'అవునా! కల అనుకుంటున్నాను నేను' అని అన్నారు. ఆరోగ్యం బాగుపడిన తరువాత భగవాన్ దగ్గరకు వెళ్ళి సాష్టాంగ నమస్కారం చేశారు ప్రహ్లాద్ గారు.

హౌస్ సర్జన్ అయిన తరువాత వారికి మొదటిసారి ఉద్యోగం రాయవెల్లూరు హాస్పటల్లో వచ్చింది. అదే సమయంలో భగవాన్ చెల్లెలు అలమేలు అత్త ఆ హాస్పటల్లో చేరితే మంచాలు లేవని కింద పరుపు వేసి పడుకోబెట్టారట. ఈయన వెళ్ళి హాస్పటల్‌లో పని చేస్తున్న వాళ్ళని పిలిచి చివాట్లు పెట్టటంతో, అప్పుడు మంచం వేశారు. ఇది మా ఆవిడ విషయంలో కూడా ఇక్కడే (హైదరాబాద్ లో) జరిగింది. పొద్దుననగా వెళితే సాయంత్రం వరకూ డాక్టర్లు రాలేదు. మా అక్కయ్య వచ్చి అక్కడ కూర్చున్నది. సాయంత్రం ప్రహ్లాద్ గారు తన భార్యను తీసుకొని వెళ్ళటానికి వచ్చి, మా అక్కయ్యను చూసి ఏమిటి సుందరి, ఇక్కడ కూర్చున్నావు? అని అడిగారట. దాంతో మా అక్కయ్య, పొద్దుననగా రమ్మన్నారు. ఇప్పటి

వరకూ డాక్టర్లు రాలేదు. జయలక్ష్మి లోపల వున్నది అని చెప్పింది. అది విన్న ప్రహ్లాద్ గారు, ఎవరక్కడ, డాక్టర్‌ను పిలుచుకొని రండి అని చెప్పి అక్కడ పనిచేస్తున్న స్టాఫ్‌ను, ఇతరులను అందరినీ కలిపి చెడామడా తిట్టేసి మా చెల్లెలికే ఇలా చేస్తే ఇతరుల విషయంలో మీరెలా ప్రవర్తిస్తారు? నా శ్రీమతి తెలుసని తను చెప్పింది. ప్రహ్లాద్ గారి చెల్లెల్ని అని చెప్పినా కూడా మీరు లేబర్ రూములో ఎలా అంతసేపు పడుకోపెడతారు? అని అరవటంతో 5 నిమిషాలలో ఆపరేషన్ చేసేశారు. అటువంటి వారు ఫిలిప్పీన్స్‌లో జరుగుతున్న ఒక కాన్ఫరెన్సుకు ప్రతీ దేశం తరుపున ఇద్దరిని పిలిస్తే, భారతదేశం తరుపున వీరు అక్కడకు వెళ్ళినప్పుడు కారులో ప్రయాణిస్తున్నప్పుడు 14 మంది అందులో వుంటే వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ప్రమాదంలో ఈయన ఒక్కరే చనిపోయారు. వారి శరీరాన్ని మన దేశానికి తీసుకొని వచ్చినప్పుడు వేలమంది జనాలు వారి పార్థివ శరీరాన్ని చూడటానికి వచ్చారు. క్రైస్తవులు, మహమ్మదీయులు, హిందువులు అందరూ వచ్చి వారి వారి ప్రార్థనలు చేశారు. వారి శ్రీమతి ఇంకా వున్నారు. ఆవిడ పేరు రమణ సుందరి. ఆవిడకు భగవాన్ అన్నప్రాశన చేశారు.

కే.యస్. గారు కోమాలో ఉన్నప్పుడు కే.యస్ గారింటికి కూడా ప్రతీరోజు ఏదో ఒక మతానికి చెందినవాళ్ళు, ప్రాంతానికి చెందినవాళ్ళు (బౌద్ధులు, నేపాలీయులు, సిక్కులు, ఇతర దేశాల వాళ్ళు) వచ్చి వారింట్లో ప్రార్థన చేసి వెళ్ళేవారు. వాళ్ళెవరో కూడా కే.యస్. గారి శ్రీమతికి తెలియదు.

## భగవాన్‌కు సేవ చేసిన కోడూరు వెంకటరత్నం (రమణాశ్రయి) గారితో నా అనుబంధం:

ఇక కోడూరు వెంకటరత్నం గారు (భగవాన్ సేవకులు) రమణాశ్రమంలో ఉన్నప్పటి నుండి తెలుసు కానీ, వారితో ఎక్కువ పరిచయం లేదు. నెల్లూరు వచ్చినప్పుడు మా పెదనాయన గారిని చూడటానికి యోగిరామయ్య గారు, వెంకటరత్నం గారు వచ్చే వారు. 1973లో నేను, మా ఆవిడను విజయవాడ పంపటానికి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కు తీసుకొని వచ్చినప్పుడు అక్కడ అవధూతేంద్ర సరస్వతీ స్వామివారు, వెంకటరత్నం గారు, ఉషా ఫాన్ డీలరు రామనాథం గారు ముగ్గురూ ప్లాట్ ఫారం మీద నిలుచొని వున్నారు. అప్పుడు వెంకటరత్నం గారిని పలకరిద్దామని వెళ్లి, మీరు వెంకటరత్నం గారు కదా! అని అడిగాను. అవును నాయనా నువ్వెవరు? అని అడిగితే, నేను నెల్లూరులో ఉంటున్న సాంబశివరావు గారి తమ్ముడి కొడుకునండి అని చెపితే, 'ఒరేయ్ నేనెప్పుడూ హైదరాబాద్ వస్తూ వుంటాను. నా ప్రోగ్రాం అంతా ఈ రామనాథం చూస్తూ ఉంటాడు. అతను నేనిక్కడికి వచ్చినప్పుడు నీకు తెలియచేస్తాడు. నువ్వు వచ్చి నన్ను కలుస్తూ వుండు' అని చెప్పారు. 1975 ఆగస్ట్‌లో అవధూతేంద్ర సరస్వతీ గారు కాలం చేసినప్పుడు కార్యక్రమాలకు వచ్చి హైదరాబాదులో రాఘవేందర్ రావు గారింట్లో వుండేవారు. అప్పుడు నాకు కబురు చేసి పిలిపించారు. వారి సేవ చేస్తున్నప్పుడు వారొక విషయం చెప్పారు. 'నాయనా! నాకు కూడా కాలం దగ్గరకు వచ్చింది. నా కర్మలు

రమణ భక్తులు ఎవరైనా చేస్తే బాగుంటుంది అని చెప్పి నువ్వు చేస్తావా?' అని నన్ను అడిగారు. తప్పక చేస్తానండి అని అంటే, లేదు నాయనా అట్లా చెప్పకు. ఇంటికి వెళ్లి మీ అమ్మగారిని అడుగు. మీ అక్కగారిని, బావగారినీ అడుగు. మీ చిన్నాయనను అడుగు. మీ మేనత్తనడుగు. అందరినీ అడిగిన తరువాత వాళ్ళు ఒప్పుకొంటే చెయ్యి లేకపోతే వద్దు అని అన్నారు. నేనన్నాను, వాళ్ళందరినీ అడిగితే వద్దంటారు. నేను మీకు చేస్తాను. మీరు భగవాన్ సేవ చేశారు. మీ సేవ నేను చేస్తాను అని చెప్పాను. అంటే, సరే నాయనా అన్నారు. ఇంటికొచ్చి మా అమ్మగారిని అడిగాను. వద్దన్నారు. అయితే నేను మా అమ్మతో 'మా నాన్నకు సేవ చేసే భాగ్యం నాకు కలగ లేదు. వారికైనా సేవ చేసి తరిస్తాను. వారి కర్మలు నేనే చేస్తాను' అని గట్టిగా చెబితే మా అమ్మ అప్పుడొక మాట అన్నది. "మీ నాన్న కూడా ఇలానే చేశారు. నీకు కూడా అవే పోలికలు వచ్చాయి' అని అన్నది. ప్రణవానందులవారు కాలం చేసినప్పుడు 1938లో, మా నాన్నగారే వారి కర్మలు చేశారు. అలానే నేను కూడా వెంకటరత్నం గారి కర్మలు చేశాను. ఇప్పటికీ ప్రతీ సంవత్సరం వారి ఆబ్దీకము ప్రతీ మాఘ మాసం కృష్ణ పక్ష తదియ రోజున జరుపుతూ ఉన్నాము. వారు కాలం చేసే ముందే 1975 నవంబర్‌లో నన్ను అరుణాచలం రమ్మన్నారు. వెళ్లాను. వారు 1976 ఫిబ్రవరిలో జాతకాన్ని చూసుకొని శరీరాన్ని వదిలివేశారు. కానీ అంతకు మునుపే తనకు తెలిసిన వారందరికీ ఉత్తరాలు వ్రాసి ఆ తరువాత ఆంబోతుకు ముద్రలు వేయించే కార్యక్రమం, దానికి ఏర్పాట్లు

కూడా చేయించారు. ఆ తరువాత ఫిబ్రవరి 5వ తారీఖున స్నానం చేయటానికి వెళ్ళినప్పుడు నన్ను పిలిచి, కృష్ణమూర్తీ - మొదటి చెంబు నీళ్ళు నువ్వు పొయ్యి అని అన్నారు. వారు డయాబెటిక్ కావడం వలన, కాళ్ళకు దూది కట్టుకొని, ధావళిని చుట్టుకుని కుదించుకు కూర్చొన్నారు. ఆ తరువాత గోపూజ, షోడశ దానాలు, దశదానాలు, మంచం, పరుపులు సమస్తం దానాలు ఇచ్చేశారు. ఆవు గురించి వెతక కుండానే ఎవరో వచ్చి, స్వామీ మీరు పూజ చేసుకొంటున్నారు, కాబట్టి నేను మీకు ఆవును, దూడను ఇస్తున్నాను అని ఇచ్చాడు. ఆ తరువాత ఆవుకు, ఎద్దుకు పెళ్ళి చేశారు. ఆ తరువాత ఎద్దు మీద కాల్చిన శంఖు చక్రాల ముద్రలు వేశారు. ఒక్క ముద్ర వేసే టప్పటికే ఆ ఎద్దును పట్టుకోవటం మహా కష్టమైంది. ఆ తరువాత రెండవ ముద్రను వేసి దాన్ని వదిలి వేశారు. అన్ని కార్యక్రమాలు అయ్యేటప్పటికి రాత్రి 11.30 అయ్యింది. అంతసేపూ అఖండంగా రామ నామమూ, అరుణాచలశివ నామ స్మరణ జరుగుతూనే వున్నది. వెంకటరత్నం గారి శిష్యుల భక్తి అనన్య సామాన్యమైనది. అందరి శిష్యులనూ ఎంతో తీర్చి దిద్దారు వారు. స్వామి ఎప్పుడు పిలుస్తారో అని వారి శిష్యులు గడప దగ్గర నిలబడేవారు. పిలవగానే లోపలికి వెళ్ళేవారు. ఎవరైనా ముందే తాంబూలాలను రెడీ చేసి పెట్టుకోవాలి. అంతే కానీ, పిలిచినప్పుడు అప్పుడు ఒక్కొక్కటీ వెతుక్కోవటం కాదు. అలా వారి శిష్యులు అంత బాగా ట్రైన్ అయ్యారు. వాళ్లనందరినీ చూశాక మనకేమీ రాదని నాకు అర్థమయింది. ఆ తరువాత అవభృథ స్నానం స్వామి

(వెంకటరత్నం) వారి చేత చేయించారు. ఆ తరువాతి రోజు ప్రొద్దున్నే నన్ను పిలిస్తే నేను మా అమ్మాయిని ఎత్తుకొని లోపలికి వెళ్లాను. అప్పుడు స్వామి వారు నాతో ఇలా అన్నారు. 'నేనేమీ నిన్ను డ్యూటీ నుండి రిలీవ్ చేయలేదు. పిల్లను బయట దించి రా' అని అన్నారు. నేను వెళ్లి మా ఆవిడకు మా అమ్మాయిని ఇచ్చి వచ్చాను. అప్పుడు స్వామి వారు '10 నిమిషాలైన తరువాత నీ పిల్లను తెచ్చుకో' అని అన్నారు. దీనర్థమేమిటంటే మన మనస్సు మనం చెప్పినట్లు లొంగుతున్నదా లేదా అని చూసేవారు. వెంకటరత్నం గారు నాతో ఒక మాట చెప్పారు. నాకు నువ్వు సేవ చేస్తే భగవాన్‌కు సేవ చేసినట్లే అని.

కానీ వెంకటరత్నం గారి దగ్గర పని చేస్తున్నంత కాలం సమయము తెలిసేది కాదు. భగవాన్ దగ్గర ఎట్లా వుండేదో మనకు తెలియదు కానీ వీరి దగ్గర వున్నప్పుడు పగలూ, రాత్రీ పని చేసినా అలసట తెలిసేది కాదు. నిద్ర లేకపోయినా ఇబ్బంది వుండేది కాదు. ఆ తరువాతే, మహాత్ముల యొక్క సాన్నిధ్యం ఎంత గొప్పదో అనేది నాకు అర్థం అయ్యింది.

××××

వెంకటరత్నం గారిని భగవాన్ సేవకు మీకు ఏ సమయం వీలవుతుందో చెప్పమని వారిని అడిగితే 'మీరందరూ భగవాన్ సేవకు మీకు అనుకూలమైన సమయం తీసుకొన్న తరువాత ఏ సమయం మిగులుతుందో ఆ సమయాన్ని నాకివ్వండి' అని అన్నారు. అప్పుడు మిగిలిన వారందరూ పగటి సమయం తీసుకొని, రాత్రి 10 గంటల నుండి ఉదయం 4 గంటల వరకూ వుండే

సమయాన్ని వీరికి ఇచ్చారు. ఆ సమయంలో భగవాన్ వీరిని శివ పురాణం చదవమనే వారు. వీరు భగవాన్ ను పడుకోకుండా డిస్టర్బ్ చేస్తున్నారని ఎవరో సర్వాధికారికి కంప్లైంట్ ఇచ్చారు. ఎప్పుడైతే ఆఫీసు వారు చెక్ చేయటానికి వస్తున్నారో అప్పుడు భగవాన్ వీరితో 'వెంకటరత్నం, పుస్తకం మూసి పడుకో' అని సైగ చేసి చెప్పేవారు. వాళ్ళు వెళ్ళిపోగానే మళ్ళీ చదవమని చెప్పేవారు. నేను వెంకటరత్నం గారిని ఒకసారి అడిగాను 'భగవాన్ ఎప్పుడైనా నిద్ర పోయేవారా?' అని. భగవాన్‌ను ఒకరు ఇలానే ప్రశ్న అడిగారట. అంటే 'మీరెప్పుడూ మేల్కొనే ఉంటారా?' అని మరల ప్రశ్న అడిగితే భగవాన్ 'ఎవరు మేల్కొంటారు?' అని అడిగారట. నేనెప్పుడూ వారితో, కాదండీ మీరు భగవాన్‌కు పర్సనల్‌గా సేవ చేశారు కదా అందుకని అడుగు తున్నాను అని అంటే, 'భగవాన్ యొక్క నిద్రకు, మెలకువకూ వెంట్రుక వాసి అంత తేడా కూడా వుండదు' అని చెప్పారు. ఒకసారి వెంకటరత్నం గారు శివ పురాణం చదువుతూ వుంటే ఒక స్టేజ్ (సమయం)లో చదవటం మానివేశారట. ఎందుకంటే, భగవాన్ గురక పెడుతున్నారట. దాంతో చదవటం ఆపివేస్తే, ఎందుకు చదవటం ఆపివేశావు? అని అడిగారట. దానికి వీరు, భగవాన్ మీరు నిద్ర పోతున్నారు కదా! అని అంటే 'లేదు లేదు నువ్వు చదువు' అని అన్నారట.

**శ్రీ రమణ కేంద్రంతో అనుబంధం:**

22-07-1979 లో రమణ సత్సంగం హైదరాబాద్‌లో మొదలైంది. ఆ రోజు నుండి ఈ రోజు వరకూ సత్సంగానికి వస్తూ

ఉన్నాము. రాష్ట్రపతి రోడ్డులో నేను పని చేస్తున్న ఉషా ఆఫీసుకు ఎదురుగుండా భగవాన్ భక్తులు మహాపాత్ర దవే గారు వుండే వారు. వారు ఆధ్యాత్మికంగా చాలా శక్తివంతులు, స్వయంగా భగవాన్‌ను దర్శించిన వారు. ప్రతీ రోజు సాయంత్రం 5.30 కు వెళ్లి వారి దగ్గర కూర్చునేవాడిని. వారి దగ్గర కూర్చుని ధ్యానం చేసుకొనేవాడిని. డెక్కన్ క్రానికల్ లో రమణ సత్సంగం గురించిన వార్త రాగానే వారు, వారి దగ్గర పనిచేస్తున్న పనివాడిని నా దగ్గరకు పంపించి, ఆ సత్సంగానికి వెళ్ళమని కబురు పంపించారు. మేము వెళ్లినప్పుడు కే.యస్.గారి శ్రీమతి హిందీ మహా విద్యాలయంలో సత్సంగం జరిగే చోట క్రింద ఊడుస్తూ వున్నారు. కే.యస్.గారు బల్లలు తుడుస్తూ వున్నారు. మేము చూసి ఎవరో, ఏమిటో అని అనుకొన్నాము. తరువాత కే.యస్.గారు మమ్మల్ని గురించి అడిగి తెలుసుకొని వెరీగుడ్, వెరీగుడ్ అని నవ్వుతూ మాట్లాడారు. ఆ ముఖం ఇప్పటికీ గుర్తే. అప్పుడు శ్రీహరి రావు గారి నాన్న గారు (శ్రీ జి. రాజేశ్వర రావు), పెదనాన్న గారు (శ్రీ నరసింహారావు), బి.హెచ్. వెంకటేశ్వర రావు గారు, భద్రిరాజు గారు, మద్దాళి సుబ్బారావు గారు, వారి శ్రీమతి, నీలకంఠరావు గారు, బి.యస్. రంగనాథం గారు, కే.ఆర్. సుబ్రహ్మణ్యం గారు, నారాయణ స్వామి, ముంగమూరు నరసింహం గారు ఇలా ఒక 10 నుండి 12 మంది వచ్చారు. ఆ తరువాత 6 నెలల లోపే గాంధీ సెంటినరీ హాలుకు సత్సంగాలు మారటం జరిగింది.

××××

శ్రీ రమణ కేంద్రం భవనము శంకుస్థాపనకు స్వామి రమణా నంద సరస్వతి (పూర్వాశ్రమంలో వీరి నామధేయం శ్రీ టి.ఎన్. వెంకటరామన్, శ్రీ రమణాశ్రమం ప్రెసిడెంట్), ఎన్.ఎన్. రమణన్ గారు, అళగమ్మ గారు వచ్చారు. అప్పుడు వాళ్ళు మా ఇంట్లోనే వున్నారు. రమణ కేంద్రం బిల్డింగ్ పూర్తైన తరువాత, బిల్డింగ్ ప్రారంభోత్సవానికి స్వామి రమణానంద సరస్వతి, సుందరం గారు, సుశీలమ్మ గారు వచ్చారు.

1999 లో రమణ కేంద్రం బిల్డింగ్ పూర్తవటంతో గాంధీ సెంటినరీ హాలులో సత్సంగం అయిన తరువాత అప్పుడున్న సెక్రటరీ వినోద్ రెడ్డి గారు, ప్రెసిడెంట్ సి.వి.కె. మూర్తి గారు, మేము మాట్లాడుకుంటూ ఉండగా, ఆ పై వచ్చే ఆదివారం సెప్టెంబర్ 5వ తారీఖు అయినది. ఉపాధ్యాయుల దినోత్సవం. ఇక్కడ ఏవో ప్రోగ్రాములు వుంటాయి. కాబట్టి సత్సంగాన్ని వచ్చే వారం రమణ కేంద్రంలో జరుపుకొందాం అని అనుకొన్నాము. అప్పటికప్పుడు భక్తులందరికీ వచ్చే వారం నుండి రమణ కేంద్రంలో సత్సంగాలు జరుగుతాయి అని తెలియజేశారు. ఆ తరువాత అక్కడ వున్న ఒక ట్రంకు పెట్టె, రెండు ఫోటోలూ తీసుకొని బయలు దేరాము. గాంధీ సెంటినరీ హాలులో 4 కుక్కలు ఉండేవి. అవి సత్సంగం జరిగి నప్పుడు వచ్చి మౌనంగా కూర్చునేవి. కే.యస్. గారు వెళ్ళే వరకూ గేటు దగ్గర ఉండేవి. ఎన్ని ప్రసాదాలను పెట్టినా అవి ముట్టు కునేవి కావు. ఆ కుక్కలు, మేము రిక్షాలో సామాను వేసుకొని వస్తూ వుంటే అవి ఎన్.సి.సి. చౌరస్తా దాకా వచ్చాయి.

అప్పుడు యాదయ్య గారు వెళ్ళండమ్మా, వెళ్ళండి. ట్రాఫిక్ వుంటుంది. రోడ్డు దాటటం కష్టమౌతుంది అని చెపితే కళ్ళ వెంట కన్నీరు కారుస్తూ అవి వెనక్కు వెళ్ళిపోయాయి. కేంద్రంలో ఇంకా ఫ్లోరింగ్ కాలేదు. తడి తడిగా వున్నది. ఒకటికి రెండు కార్పెట్లు వేసి సత్సంగం జరుపుకొన్నాము. ఆ తరువాత అక్టోబరులో మేము రమణాశ్రమం వెళ్ళాము. అప్పుడే క్రొత్తగా సుందరం గారు ప్రెసిడెంట్ అయ్యారు.

**ఇక సాధన గురించి:**

హంఫ్రీసు ఒకసారి భగవాన్ ను 'భగవాన్ మేము సాధారణ వ్యక్తులము. మేమెలా తరించాలి? అని అడుగుతాడు. దానికి భగవాన్ 'రాత్రి పూట నిద్రకు ఉపక్రమిస్తారు కదా! అలానే ఉదయం నిద్రనుండి మేల్కొంటారు కదా! మేల్కొనే సమయంలో ప్రక్క మీద కూర్చొని మీ ఇష్టదైవం గురించి ధ్యానించండి (Sit on the bed and think of your ishta daiva). మీరు ఈ విధంగా ప్రతీ రోజు ప్రాక్టీస్ చేస్తూ వుంటే కొంతకాలం తరువాత, అది ఒక శక్తిని (current) ఉత్పత్తి చేస్తుంది. అది మీ జీవితంలో ప్రతీ రోజు జరిగే అన్ని సమస్యలనూ పరిష్కరిస్తుంది అని చెప్పారు. ఉదయమే ఈ సాధన చేయమని ఎందుకు చెప్పారు అని అంటే మనస్సు అంతగా బహిర్గతం కాదు కనుక. భగవాన్ చెప్పిన విధంగా ప్రాక్టీస్ చేస్తే నెమ్మదిగా మనస్సు హృదయంలోనే సంస్థితమౌతుంది. అంటే, నేను యొక్క పుట్టుక స్థానాన్ని తెలుసుకొనుట. అదే భగవాన్ చెప్పినది. మనమేమో మనస్సుకు బయటకు పోయే అలవాటు చేశాము.

అందుకనే అది బయటకు పోతున్నది. వెనక్కు తిరిగే అలవాటు చేయటమే ధ్యానం. కానీ ధ్యానం కూడా శరీర భావంతో చేస్తూ ఉంటే శరీర భావన ఎప్పుడు పోతుంది? అందుకే భగవాన్ "ఆత్మ నేను, ఆత్మ నేను" అని అనుకోమన్నారు. అలా చేస్తే తొందరగా ఆత్మను చేరుకొంటాం. లేకపోతే మళ్ళీ శరీరాలు తీసుకొంటూనే ఉండాలి. మనం ఈ అజ్ఞానమనే నిద్ర నుండి మేల్కొనాలి.

××××

మా అక్క (రుక్మిణి) ఒకసారి రమణాశ్రమం వెళుతూ వుంటే కొండ మీద నుండి ఒక శిల తీసుకొనిరా, నేను రోజూ అభిషేకం చేసుకొంటాను అని అంటే తను ఒక శిలను తీసుకొని వచ్చింది. దాంతో ఇప్పటికీ ఆ శిలకు అభిషేకం చేసి ఆ తీర్థం తీసుకొంటాను.

××××

నా నిత్య కార్యక్రమము 60 సంవత్సరాల నుండి ఏమిటంటే, ఉదయం 4.30 గంటలకు లేచి చిన్నపాటి ఆసనాలు వేసిన తరువాత ఒక 45 నిమిషాలు నిత్య పారాయణ స్తోత్రాలను చదువు కోవడము. కానీ డిసెంబరు 2020 నుండి ఈ నిత్యపారాయణ చేద్దామంటే అవన్నీ ఒక్కసారిగా ఆగిపోయాయి. పారాయణ చేద్దా మని అనుకున్నా ఏవీ గుర్తుకు రావటం లేదు. వీటితో ఇక నాకు సంబంధం లేదు అని అనిపించింది. ఇప్పుడు ఎవరు ఏమి అంటున్నా అవి లోపలికి వెళ్ళటం లేదు. మనస్సనేది లేదు అనేది తెలుస్తున్నది. అది భగవాన్ యొక్క అనుగ్రహమే. భగవాన్ కృప చేత ఇప్పుడిప్పుడే ఆ భాగ్యం కలిగింది అని అనిపిస్తోంది. 1963

లో మనస్సు ఎప్పుడైతే అంతర్ముఖత్వం చెందినదో, అప్పటి నుండి 'నేను స్ఫురణ' అనేది నిరంతరాయంగా తెలుస్తూనే వున్నది. భగవాన్ అక్షరమణమాల లో చెప్పినట్లు 'నేనడింగిన చోట నేను నేననుచు తానుగా నిలుచును తాను పూర్ణంబు' అని ఆ 'నేను' అనేది లోపలి నుండి పలుకుతూ ఉంటుంది. అది వినగలిగితే అదృష్టవంతులం.

× × × ×

(శ్రీ గ్రిద్దలూరి కృష్ణమూర్తిగారు సత్సంగంలో తమ ప్రసంగాన్ని "జయ శ్రీ రమణ జయ శ్రీ రమణ జయ శ్రీ రమణ జయ రమణ" నామంతో ప్రారంభించేవారు).

ఇలా మహాత్ముల సేవలో తమ జీవితాన్ని తరింప చేసుకున్న శ్రీ గ్రిద్దలూరి కృష్ణమూర్తిగారు ఒక కార్యక్రమానికి విజయవాడ వెళ్లి 16-12-2023 (శనివారం) ఉ॥5.30 గంటలకు తిరిగి వచ్చిన తరువాత ప్రార్థన చేసుకుని పడుకుని ఉ॥ 8.00 గంటల సమయంలో ప్రార్థనలోనే శాశ్వతంగా భగవాన్ మరియు మాస్టర్ సి.వి.వి. గారిలో ఐక్యమయ్యారు.

అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ
అరుణాచలా!!!

# తిరుచ్చుళి - శ్రీరమణుల జన్మస్థానం

**శ్రీరమణాశ్రమ ప్రచురణ Fragrant Petalsలోని రెండవ వ్యాసానికి స్వేచ్ఛానువాదం**

**అనువాదకులు: శ్రీ ఎమ్.వి. సరోజాప్రసాద్**

పురాతన కాలం నుండి తిరుచ్చుళి ప్రసిద్ధమైన పుణ్యక్షేత్రం. అక్కడ నెలకొన్న ఆలయం అతి ప్రాచీనమైనది. భగవాన్ శ్రీ రమణ మహర్షి జన్మస్థలం కావడంతో తిరుచ్చుళి పేరు ప్రఖ్యాతులు మరింత ఇనుమడించాయి.

ఈ ఊరిలోనే, 1879 లో శ్రీ సుందరం అయ్యర్, శ్రీమతి అళగమ్మాళ్ దంపతులకు వెంకటరామన్ అనే కుమారుడు జన్మించాడు. శ్రీ సుందరం అయ్యర్ సంప్రదాయ ఆచార పరాయణులైన బ్రాహ్మణులు. ప్లీడర్‌గా సేవ చేసేవారు. వారి భార్యకు కూడా దైవభక్తి మెండు. వితరణశీలి కూడా. వారికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. వీరిలో వెంకటరామన్ రెండవ కొడుకు.

తిరుచ్చుళి రామనాథపురం జిల్లాలో తాలూకా కేంద్రం - మానామదురై నుండి దాదాపు 38 మైళ్ళ దూరంలో ఉన్న ఈ చిన్న పట్టణానికి, అప్పట్లో బస్సులు మాత్రమే ఉండేవి. ఇప్పుడు, మానామదురై నుండి విరుదునగర్ రైలు మార్గంలో, ఇక్కడికి రైలు సౌకర్యం కూడా ఏర్పడింది.

ఈ ఊరికి తిరుచ్చుళి అనే పేరు ఎలా వచ్చిందో తెలిపే కథ ఇది. మహాప్రళయం సంభవించి, ఈ భూమండలమంతా నీట మునిగిపోయినప్పుడు, ఆ నీరు వెలుపలికి పోయేందుకు,

పరమశివుడు భూమిలో వృత్తాకార రంధ్రాలు చేశాడట. నీరు సుడులు తిరుగుతూ, బయటికి పోవడంతో (తమిళంలో చుళి అంటే తెలుగులో సుడి), ఈ ఊరికి తిరుచ్చుళి అనే పేరు వచ్చింది.

ఇక్కడి శివాలయానికి, వందల సంవత్సరాల చరిత్ర ఉన్నది. స్వామివారికి, అమ్మవారికి వేరు వేరు ఆలయాలు, ఒక్కొక్క ఆలయానికి ఎత్తైన గోపురం వున్నాయి. రెండు గర్భాలయాల ప్రక్కన, ఆనాటి పాలకులు చెక్కించిన శాసనాలను చూడవచ్చు. శ్రీ సుబ్రహ్మణ్య చెట్టియార్ అనే వదాన్యుడు, 1957లో ఈ ఆలయాలను పునరుద్ధరించి కుంభాభిషేకం జరిపించారు. ప్రతి ఏటా ఆషాడ మాసంలో, ఇక్కడ ఆడిల్లరం ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తారు.

ఈ ఆలయంలో శ్రీ భూమినాథుడు తన దేవేరి సహాయవల్లితో కలసి పూజలందుకొంటున్నాడు. ఈ క్షేత్రానికి, యిక్కడ పూజిస్తున్న దేవతలకు పురాణ కథల్లో ఎన్నో పేర్లున్నాయి. తిరుచ్చుళిని తిరుచ్చుళియల్, పున్నైవనం, ఆవర్తపురం, త్రిశూలపురం, కాళీశ్వరం, భువనేశ్వరం - ఇలా అనేక పేర్లతో వ్యవహరిస్తారు. స్వామిని భూమినాథర్ అనడంతోబాటు, భూమేశ్వర్, భువనేశర్, తిరుమేని నాథర్, చుళికేశర్ - అని, అమ్మవారిని సహాయవల్లి అనే కాకుండా తునైమలై అమ్మన్, ముత్తుమలై ఉమైయాళ్ - అని పిలుచు కుంటారు.

అప్పర్, సుందరర్, మాణిక్యవాచకర్, సంబంధర్ వంటి భక్తాగ్రేసరులు, తపోధనులు తిరుచ్చుళి క్షేత్రాన్ని సందర్శించి

పరమేశ్వరుడిని, అమ్మవారిని ప్రస్తుతిస్తూ పలు కీర్తనలను గానం చేశారు.

ఈ ఆలయం చుట్టూ తొమ్మిది పవిత్ర తీర్థాలు వున్నట్లు చెప్తారు. అవి - శూల తీర్థం, పాప హారిణి, కణ్వ తీర్థం, కలువ తీర్థం, కోటి తీర్థం, భూమి తీర్థం, అమృత వాపి, బ్రహ్మ తీర్థం, త్రిలోచన తీర్థం.

ఇక్కడ లింగాకారంలో వెలసిన భూమినాథుని, దేవతలు సైతం అర్చిస్తారని ప్రతీతి. స్వామి, ఈ ఆలయాన్ని దర్శించే భక్తుల దుఃఖోపశమనం చేసి, వారి పాప ప్రక్షాళన గావిస్తాడని, ఆయురారోగ్యాలతో పాటు, సంపదను, సంతానాన్ని కూడా అనుగ్రహిస్తాడని భక్తుల విశ్వాసం. ఇక్కడ చేసే పూజలు, దానాలు, యజ్ఞయాగాది క్రతువుల ఫలం వేయి రెట్లు అధికంగా వుంటుందని, అపార పుణ్య ఫలం లభిస్తుందని శాస్త్ర వచనం. క్షేత్ర ప్రాశస్త్యం దృష్ట్యా, దీనిని కాశీతో పోల్చడం కద్దు. ఇక్కడ తనువు చాలించిన వారికి జన్మ రాహిత్యం లభిస్తుందని, మోక్ష ప్రాప్తి కలుగుతుందని విశ్వసిస్తారు. బృహత్పాలుడనే చంద్ర వంశ పాండ్య రాజు ఈ క్షేత్రంలో అడుగిడినంతనే, ఆయనకు సోకిన బ్రహ్మహత్యాపాతకం నుండి విముక్తుడైనాడట.

ఈ ఆలయానికి తూర్పున కౌండిన్య నది, దక్షిణవాహినిగా ప్రవహిస్తుంది. కౌండిన్య మహర్షి తపస్సుకు మెచ్చిన ఈశ్వరుడు, గంగా నదిని, కౌండిన్య నది రూపంలో ఇక్కడకు తెచ్చాడని పురాణ కథనం. ఈ నదిలో స్నానమాచరించడం పుణ్యప్రదంగా భావిస్తారు.

ఆలయం ముందున్న కోనేరును త్రిశూల తీర్థం అంటారు. పరమశివుడు తన త్రిశూలం పోటుతో ఈ తీర్థాన్ని సృష్టించాడని అంటారు. ఈ తీర్థంలో స్నానమాచరిస్తే, జన్మజన్మల పాపాలు నిశ్శేషంగా క్షాళనమవుతాయని విశ్వాసం.

ఏటా మాఘ మాసంలో పౌర్ణమి నాడు గంగా మాత అరుదెంచి, ఈ పుష్కరిణిలో స్నానమాడి భూమినాథుడిని అర్చిస్తుందని ప్రతీతి. ఇప్పటికీ, పౌర్ణమికి ముందు, శుక్ల పక్షంలో, ఈ కోనేటిలో నీరు క్రమేపి పెరుగుతూ వచ్చి, పౌర్ణమి నాటికి గరిష్ఠ స్థాయికి చేరుతుంది. అక్కడి నుండి కృష్ణ పక్షంలో నీటి స్థాయి క్రమేణా తగ్గనారంభించి, అమావాస్య నాటికి పూర్తి స్థాయికి పడిపోతుంది.

ఈ తీర్థ వైశిష్ట్యం గురించి, ఇందులో నీటి స్థాయి పెరగడం, తగ్గడం గురించి, భగవాన్ రమణులు తరచు ప్రస్తావించేవారు. మాఘ మాసంలో తిరుచ్చుళి వెళ్ళే భక్తులు కోనేటిలో నీటి హెచ్చు తగ్గులు చూసి రావాలని కూడా చెప్పేవారు.

వెంకటరామన్ గా భగవాన్ రమణులు జన్మించిన ఇల్లు, తిరుచ్చుళి కార్తిగై వీధిలో ఉన్నది. శ్రీ రమణాశ్రమం వారు 'సుందర మందిరం' పేరిట ఈ ఇంటిని పునరుద్ధరించి, భగవాన్‌కు పూజాదికాలు నిర్వహిస్తున్నారు.

మదురైలో, చొక్కప్ప నాయకర్ వీధిలోని ఇంటిలో, భగవాన్ బాల్యం గడిచింది. ఈ ఇంటిని కూడా శ్రీ రమణాశ్రమం వారు 'శ్రీ రమణ మందిరం' పేరిట అభివృద్ధి చేశారు. ఇక్కడ కూడా, భగవాన్‌కు నిత్యపూజలు జరుగుతున్నాయి.

# అభ్యాసం - ఆవశ్యకత

ఆంగ్ల మూలము: ఎ.ఆర్. నటరాజన్
అనువాదకులు: చిక్కాల కృష్ణారావు

సాక్షాత్కారం కలిగే వరకు సాధన చేయవలసిందే.
అది అవసరం కూడానూ.
నీకు ఆత్మ కరతలామలకం కావాలి.
లేనియెడల, సుఖం సంపూర్ణం కాదు.
స్వేచ్ఛాపూరకమైన సహజస్థితి కలిగేవరకు,
ఏదో ఒక విధంగా సాధన, ప్రయత్నం చేస్తూ ఉండాలి.

*****

సాక్షాత్కారానికి ఈశ్వరానుగ్రహం అత్యవసరం.
కాని, నిజమైన భక్తునికి, యోగికి మాత్రమే
ఆ అనుగ్రహం దయతో లభిస్తుంది.
ముక్తి మార్గంలో నిరంతరం తీవ్ర సాధన చేసిన వారికి
మాత్రమే, అది ఇవ్వబడుతుంది.

*****

ప్రయత్నా ప్రయత్నాలకు అతీతమైన ఒక స్థితి ఉన్నది.
అది పొందేవరకు ప్రయత్నం, సాధన అవసరం.

*****

అనుగ్రహం ఎప్పుడూ ఉన్నది. కాని, అభ్యాసం కూడా అవసరం.

*****

పురుష ప్రయత్నంతో ఆత్మలో నిలకడ కలిగి ఉండటమనేది ఎలా ఉంటుందంటే, దొంగ ఎద్దుకు పచ్చగడ్డి వేసి, దాన్ని గోశాల నుండి మంచి పచ్చగడ్డి వున్న ఇతరుల పొలల్లోకి పోనీయకుండా చేసినట్లు ఉంటుంది. నువ్వు ప్రయత్నం చేయడం, గురువు సహాయం చేయడం రెండూ అవసరమే.

*****

ఇక్కడే - ఇప్పుడే ఆత్మ సాక్షాత్కారం కలిగే వరకు జాగ్రదవస్థలో సాధన చేస్తూ ఉండాలి. అవాంఛిత, అప్రయత్న ఎఱుకే మన నిజ స్వరూపం, మనుజ స్థితి. మనం ఆ స్థితిని అందుకుని, అందు నిలువగలిగితే, అది చాలా మంచి సంగతే! కాని, ప్రయత్నం లేకుండా దాన్ని అందుకోలేము. అంటే, కావాలని యోచించి చేసే ధ్యానం ద్వారానే దాన్ని పొందాలి.

*****

ప్రతి గురువు, ప్రతి గ్రంథం సాధకుణ్ణి "ఊరకే ఉండు" అని చెపుతాయి. కాని, అది చెప్పినంత సులభం కాదు. అందు చేతనే ప్రయత్నం అంత అవసరమైంది. ఒకరు అప్రయత్నంగా ఈ పరమ ప్రశాంత స్థితిని పొందినట్లు నువ్వు చూశావంటే, వారు దానికి కావలసిన సాధనలు పూర్వ జన్మలో చేసి ఉంటారని నిర్ణయించుకో. ఆలోచనా విముక్తికి నీకు ఏది సహాయం చేసిందో దాన్నే ధ్యాన మార్గంగా ఎన్నుకుని, ఉపయోగించుకో!

***సేకరణ: శ్రీ రమణ మహర్షి దివ్య బోధలు అనే గ్రంథము నుండి***

## A Series of Extraordinary Events

Dr K Subrahmanian

I'm happy to see in our midst Sri Sreenath's father, Linga Laxmiah *garu*, for whom I have great admiration because what most of us would like to be, he is, effortlessly. He is going to be 90 on October 24, and for 70 of those 90 years, he's been wearing *khadi*. The extraordinary thing about him and his family is that he, his sons, granddaughters and grandsons live in the same house – there are as many as 42 members living under one roof. We all know how difficult it is even for two people to live together! Laxmiah *garu's* family does not have a cook; the daughters-in-law of the household do all the cooking. Even at the age of 90, Sri Linga Laxmiah *garu* assists them in cutting vegetables, both in the morning and evening. Cutting vegetables day after day for a family of forty-two, when he can actually ask someone else to do it, is an extraordinary thing. He's a true *karma yogi*.

Spirituality should be reflected in our day-to-day life; it should not be confined to the *puja* room. Bhagavan repeatedly pointed out to his devotees that religion is not religion if it shows no concern for others; the meditation, *puja* and *japa* that we do should be reflected in our attitude towards other people. If we have no concern for other people, it means we are not religious. Detachment does not mean indifference to others or a lack of attachment; detachment means attachment to all, without any discrimination. What we have now is attachment for some,

and dislike for others. When we evolve as an individual, we see that there is greater concern for other people. Eventually, we realise that we are everybody and everybody is us; this is the highest stage. We should understand from the life of Bhagavan that detachment does not mean indifference to other people; it means indifference to ourselves, and concern for others. Most of us talk about being practical; there is nothing more practical than this. If we learn to forget our own interest, then our interest will be looked after by the Lord. Even though this is one hundred percent true, for various reasons, we have our own doubts and suspicions. We think that if we don't do something for ourselves, then our family will suffer. If we do something sincerely for others, without expecting anything in return, when there is a need, then our needs will be looked after by the Lord. But if we do something expecting something in return, then it becomes a business proposition.

As a young boy of 17, Bhagavan left without taking leave of anyone. The train he was planning to take was scheduled to arrive at twelve, and the walk from his house to the station was twenty minutes. Although it was getting late, he never worried; he did not feel that he had to wait for the next day to catch the train. When Bhagavan reached the station, he found that the train was running late that day. He looked at the timetable pasted on the wall, and also at an old map there. He decided that he would get off at Tindivanam in order to get to Tiruvannamalai. The fare to Tindivanam was two rupees and thirteen annas, and

